క్లుప్తంగా

వలకి చిక్కిన వింత చేప


గోపాలయ్య వలలో చిక్కిన చేప

మనుబోలు: మండలంలోని బండేపల్లి గ్రామంలో ఓ గుంతలో సోమవారం రైతు వలకి ఓ వింత చేప చిక్కింది. గ్రామానికి చెందిన రైతు నోసిన గోపాలయ్య చేపల కోసం బొందలో వల వేశాడు. కొద్ది సేపటి తరువాత వలను తీయగా పలు రకాల చేపలు వలలో చిక్కాయి. వీటితో పాటు ఓ వింత చేప కూడా వలలో ఉండడంతో అందరూ ఆశ్చర్యపోయారు. చూసేందుకు కొరమీను, ఇసుకపురి చేప లాగే ఉన్న ఈ చేప చర్మంపై చారలు ఉన్నాయి. ఇలాంటి చేపలు మనుబోలు పరిసర ప్రాంతాల్లో ఎప్పుడూ చూడలేదని స్థానికులు అంటున్నారు. అయితే గోపాలయ్య ఆ చేపను మళ్లీ నీళ్లలో వదిలివేశాడు.

18న శివరాత్రి వేడుకలు


బ్రహ్మదేవిలోని పురాతన కైలాసనాథేశ్వరస్వామి ఆలయం

ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవిలో పురాతన శ్రీకామాక్షితాయి సమేత కైలాసనాథేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ చైర్మన్ కట్టా సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున వేకువజామున 3 గంటల నుంచి కైలాసనాథేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూలంగిసేవ, విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి స్వామివారికి నందిసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే కృష్ణపట్నంలోని శ్రీసిద్ధేశ్వరాలయం, వల్లూరులోని కైలాసనాథేశ్వరాలయం, పైనాపురంలోని భోగేశ్వరాలయం, ఈపూరులోని విరూపాక్షేశ్వరాలయం, ముత్తుకూరు, పిడతాపోలూరు గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

డీఈఓను కలిసిన ఏపీటీఎఫ్ నేతలు




నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవానీని ఏపీటీఎఫ్ నేతలు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణారెడ్డి, జుల్ఫికర్, వెంకటేశ్వరరెడ్డి, ఆరిఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

బంగారంతో ఉడాయించిన ఏజెంట్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బంగారంతో ఉడాయించిన ఏజెంట్‌ను సంతపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొగతోటకు చెందిన వరుణ్ మండపాలవీధిలో మోడరన్ జ్యువెలరీస్‌ను నిర్వహిస్తున్నారు. పెద్దబజార్‌కు చెందిన రబ్బానీ దుకాణంలో ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. దుకాణంలోని 700 గ్రాముల బంగారంతో గత నెల 31న రబ్బానీ ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా నిందితుడిపై కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పొర్లుకట్ట వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని నుంచి రూ.20 లక్షల విలువజేసే 457.7 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు పంపారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెస్ టోర్నీ విజేతగా సుమన్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి చెస్ టోర్నీ విజేతగా సుమన్ నిలిచారు. పార్థసారథినగర్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో జిల్లా చెస్ అసోసియేషన్, ఆర్‌ఎల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సుమన్, హేమల్‌వర్షన్ ఆరు రౌండ్లకు గానూ ఆరు పాయింట్లు సాధించి ఆధిపత్యం ప్రదర్శించారు. అయితే బుచ్ స్కోర్ ఆధారంగా సుమన్‌ను విజేతగా, హేమల్‌వర్షన్‌ను రన్నర్స్‌గా టోర్నీ చీఫ్ ఆర్బిటర్ రామ్‌లక్ష్మణ్ ప్రకటించారు. తర్వాతి స్థానాలను ప్రద్యుమ్నలక్ష్మి, సుమనీష్, హరీష్‌కుమార్ సాధించారు. అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సీనియర్ క్రీడాకారుడు వెంకటేశ్వరరావు, సిల్వర్ ఓక్స్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ్, డిప్యూటీ ఆర్బిటర్స్ వెంకటరమణ, ప్రదీప్, వంశీకృష్ణ, సుగత్రా, తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్' బృహత్తర కార్యక్రమం


రేగడిచెలికలో 'ఫ్యామిలీ ఫిజీషియన్' అమలు గురించి తెలుసుకుంటున్న డాక్టర్ బ్రిజిత

కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఫ్యామిలీ ఫిజీషియన్' ఒక బృహత్తర కార్యక్రమమని, వైద్యసేవలు అవసరమైన వారంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ, ఈ కార్యక్రమం కావలి డివిజన్ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ బ్రిజిత సూచించారు. సోమవారం మండలంలోని రేగడిచెలికలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్యబృందం నిర్వహించిన 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి వైద్యసేవలందించేలా ప్రభుత్వం చర్యలు ప్రవేశపెట్టిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రులకు వెళ్లలేని వారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ తేదీన 'ఫ్యామిలి ఫిజీషియన్' కార్యక్రమం జరుగుతుందో ముందే సమాచారం ఇస్తున్నందున ఇంటి వద్ద చికిత్స అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది నిర్దేశించిన తేదీల్లోనే విధిగా కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత కూడా వైద్యసిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.రామకృష్ణ, హెచ్‌ఎస్ పద్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్‌కే రేష్మ, హెచ్‌ఏలు సీహెచ్ సుధాకర్, జె.షీల, ఆశా కార్యకర్త సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కోవూరు: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తోందని డీసీఎంఎస్/డీఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక టీఎస్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం సోమవారం ఆ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గంలోని విద్యార్థులకు అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సికందర్, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు విమల, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న క్రీడాపోటీలు


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు

ఇందుకూరుపేట: నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థికసాయంతో, స్థానిక నాయకుడు దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 98వ గ్రిగ్స్ కోవూరు జోన్ క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యనిర్వాహక కమిటీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీలత, కార్యదర్శి ఎం.పల్లవి, ఉపాధ్యాయిని ఉమాకిరణ్, హెచ్‌ఎం నాగేశ్వరరావు ఈ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, దశరథరామిరెడ్డి, ముజీర్, శ్రీనివాసులు, సిరాజ్, కృష్ణమోహన్, రేణుక, బీవీ రమణయ్య, నరసయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి


మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలిస్తున్న ఎంపీపీ పార్వతి

కోవూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తోందని ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి తెలిపారు. మండలంలోని లేగుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భోజన పథకాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, తలపల వేణుగోపాల్, ఏపీఎం వెంకటస్వామి, కోఆప్షన్ సభ్యుడు వెంకటస్వామి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే జరిమానా


అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న కమిషనర్, పారిశుద్ధ్య కార్మికులు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలోని దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వాటిని ప్రోత్సహించినా జరిమానా విధిస్తామని కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. తడి, పొడి చెత్తలను వేరుచేయడం, ప్లాస్టిక్ నివారణపై సోమవారం బుచ్చిరెడ్డిపాళెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదని దుకాణదారులను హెచ్చరిస్తున్నామని, అయినా కూడా మార్పు రావడం లేదన్నారు. దీనిపై మంగళవారం నుంచి ప్రతి దుకాణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతోపాటు ప్లాస్టిక్ కవర్లను గుర్తిస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు ఇచ్చిన చెత్తబుట్టల్లో వేసి పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినప్పుడు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన



నెల్లూరు (టౌన్): పౌరులకు కల్పించిన ప్రాథమిక, ఇతర హక్కులపై పొదలకూరు రోడ్డులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ మాట్లాడారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షించారు. అనంతరం అక్కడి భోజన, వసతులను పరిశీలించారు. సుజాత, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు (అర్బన్): ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై ఆర్బీఐ రూపొందించిన మూడు రకాల పోస్టర్లను కలెక్టర్ చక్రధర్‌బాబు తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొదుపు, ఆర్థిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ పోస్టర్లను రూపొందించారని చెప్పారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ జోగారావు, ఎస్‌బీఐ ఆర్‌ఎం శ్రీనివాస్, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, నాబార్డు డీడీఎం రవిసింగ్, ఏపీజీబీ ఆర్‌ఎం శైలేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి బైండోవర్

నెల్లూరు(క్రైమ్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పొదలకూరు రోడ్డు సెంటర్‌లో ఆదిత్య, మహేష్‌బాబు, రాజా వెంకటసిద్ధార్థను దర్గామిట్ట ఎస్సై సుబ్రహ్మణ్యం అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని బైండోవర్ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముత్తుకూరు: ముత్తుకూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

నేడు కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

కొడవలూరు: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం కొడవలూరులో కేన్సర్‌పై అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ఎం.రామకృష్ణ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ ర్యాలీలో వైద్యసిబ్బందితోపాటు గ్రామస్తులు కూడా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. అవగాహనతోనే కేన్సర్‌ను దూరం చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.

వినతుల స్వీకరణ

పొదలకూరు: ప్రజల సాధారణ సమస్యలపై సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ వినతులను స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి హాజరైన రైతులు దారి వివాదాలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల సర్వే తదితర సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున భూముల పంపిణీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడిందన్నారు. ఎన్నికల అనంతరం తిరిగి ప్రక్రియను ప్రారంభించి జాబితాలను సిద్ధం చేస్తామని తెలిపారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

వెంకటాచలం: రెవెన్యూ పరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ కృష్ణ సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు అందజేసిన వినతులను పరిశీలించిన వెంటనే పరిష్కారానికి వీలున్న సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏదైనా కారణాలతో సమస్య పరిష్కారానికి వీలుకాకుంటే వెంటనే సంబంధిత అర్జీదారులకు విషయాన్ని తెలియజేయాలని సూచించారు. అర్జీదారులను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు.

పొలం వద్దనే ధాన్యం సేకరణ

కొడవలూరు: రైతులకు సౌలభ్యంగా పొలం వద్దనే ధాన్యం సేకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకొందని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మండలంలోని యల్లాయపాళెం రైతుభరోసా కేంద్రంలో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందని తెలిపారు. నాణ్యత పరీక్ష కోసం ధాన్యం నమూనాలను కూడా టెక్నికల్ అసిస్టెంట్ పొలానికే వెళ్లి తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ధాన్యం మద్దతు ధరతోపాటు గోనె సంచులు, లేబర్, రవాణా చార్జీలను 21 రోజుల్లోనే రైతు ఖాతాలో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఉమామహేష్, వీఆర్వో వెంకట్రావు, సొసైటీ సీఈఓ వంశీ, సిబ్బంది రోజా, రైతులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగిన యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు కె.విధిలేష్(24) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు మండలంలోని చౌకచెర్ల గ్రామానికి చెందిన విధిలేష్ స్థానికంగా వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల విధిలేష్ గ్రామంలో ఎక్కువగా అప్పులు చేశాడని తెలుసుకున్న తల్లిదండ్రులు అతనిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన విధిలేష్ మూడు రోజుల కిత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు విధిలేష్‌ను చికిత్సనిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ విధిలేష్ సోమవారం మృతిచెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అజ్ఞాతంలోకి బంగారు వ్యాపారి

నెల్లూరు(క్రైమ్): ఓ బంగారు వ్యాపారి సహచర వ్యాపారులను నట్టేటా ముంచారు. కుటుంబంతో సహా రాత్రికి రాత్రే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్లకు క్యూ కడుతున్నారు. వివరాలు.. నగరానికి చెందిన కిరణ్ చిన్నబజార్‌లో బంగారు వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారావసరాల నిమిత్తం అప్పుడప్పుడూ సహచరుల వద్ద కిలోల్లో బంగారాన్ని తీసుకునేవారు. వ్యాపారాల్లో నష్టాలో మరే ఇతర కారణమో తెలియదు గానీ ఇటీవల ఆయన కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని సమాచారం. బంగారాన్ని ఇచ్చిన వ్యాపారులు ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్లకు క్యూ కడుతున్నారు. సంతపేట, నవాబుపేట పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే ఒకరిద్దరు బాధితులు ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. మొత్తంగా 20 కిలోలకుపైగా బంగారాన్ని తీసుకున్నారనే ప్రచారం వ్యాపార వర్గాల్లో జరుగుతోంది.

బ్రహ్మోత్సవాలకు మంత్రి కాకాణికి ఆహ్వానం


బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: పట్టణంలోని శ్రీకామాయిక్షి తాయి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆలయ పాలకమండలి ఆహ్వానించింది. సోమవారం పాలకమండలి సభ్యులు నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి చేతులమీదుగా బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ తన్నీరు సుబ్రహ్మణ్యం, ఈఓ పెంచలవరప్రసాద్, పోలేరమ్మతల్లి ఆలయం చైర్మన్ మొలబంటి శేఖర్‌బాబు, సభ్యులు డి.విజయభాస్కర్‌రెడ్డి, వూకోటి లక్ష్మీనారాయణ, సోమ భాస్కరరావు, చొప్పా వెంకటేశ్వర్లు, ఎం.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరాలనిచ్చే దేవుడు రామలింగేశ్వరుడు

- నమ్మి ఆరాధిస్తున్న భక్తులు
- 17 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు


పొదలకూరులోని కామాక్షీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం

పొదలకూరు: పట్టణంలో వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన శ్రీకామాక్షీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన రామలింగేశ్వరుని కోరిన వరాలనిచ్చే దేవుడిగా భక్తులు నమ్ముతారు. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సమీప గ్రామాల నుంచి ఈ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయ ప్రాంగణంలోనే గణనాథుడు కూడా పూజలందుకుంటున్నాడు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

మహాశివరాత్రి సందర్భంగా ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17న సాయంత్రం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణ, రావణసేవ, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా 18న రాత్రి నందిసేవ 12 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 19న సాయంత్రం గిన్నెబిక్ష, 20న ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం గజవాహనసేవ, పారువేట, 21న రాత్రి అలకలతోపు, 22న ఉదయం ధ్వజావరోహణం, రాత్రి ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు ప్రసాద్‌స్వామి తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం

- అన్ని పరీక్షలు ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నాం
- డీసీఎస్‌హెచ్ రమేష్

సాక్షి ఎఫెక్ట్..


బాలింతతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ రమేష్

కోవూరు: కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వైద్యుల నిర్లక్ష్యం – పేదలకు శాపం' అనే కథనానికి డీసీఎస్‌హెచ్ రమేష్ స్పందించారు. సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్‌లో ఉన్న విలువైన పరికరాలను పరిశీలించారు. కొన్ని పరికరాలు పనిచేయలేదనే విషయాన్ని ల్యాబ్ సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. టెక్నిషియన్‌ను పిలిపించి మరమ్మతు పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా వైద్య ఆరోగ్య సేవలు, వైద్యపరీక్షలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీరు, గర్భిణులు, బాలింతలకు కూర్చొనేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా మార్పు చేసేందుకు ఇప్పటికే ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే దాతలు స్పందించి కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట వైద్యశాల సూపరింటెండెంట్ విజేత, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): దోపిడీకి యత్నించిన కేసులో పరారీలో ఉన్న రౌడీషీటర్‌ను చిన్నబజార్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డులోని జేవీఆర్ కాలనీకి చెందిన అఖిల్ అలియాస్ చిన్నూ, లేక్‌వ్యూ కాలనీకి చెందిన హరికుమార్ అలియాస్ చింటూ, రాజీవ్ గృహకల్పకు చెందిన నారాయణ, శ్రీనివాసులు అలియాస్ బాన, కోటమిట్టకు చెందిన యూనస్, మరో వ్యక్తి స్నేహితులు. వీరంతా ముఠాగా ఏర్పడి ఈ నెల తొమ్మిదో తేదీ తెల్లవారుజామున సండే మార్కెట్ వద్ద వచ్చిపోయే వ్యక్తులను కత్తులతో బెదిరించి దోపిడీలకు యత్నించారు. దీనిపై సమాచారం అందుకున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని అఖిల్, హరికుమార్, నారాయణ, యూనస్‌ను అరెస్ట్ చేశారు. శ్రీనివాసులు అలియాస్ బాన, మరో నిందితుడు పోలీసులను చూసి పరారయ్యారు. ఈ క్రమంలో శ్రీనివాసులును అతని ఇంటి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. నేరాలకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.